క్లుప్తంగా

పారిశుధ్య నిర్వహణలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న కమిషనర్ రాజశేఖర్

సుల్తానాబాద్: ప్రతి పౌరుడు పారిశుధ్య నిర్వహణలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ కోరారు. పట్టణంలో గురువారం 1, 11వ వార్డులో చేపట్టిన పారిశుధ్య నిర్వహణ కార్యక్రమంలో భాగంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి, పొడి చెత్తను వార్డులోకి వచ్చే స్వచ్ఛ మున్సిపల్ ఆటోలకు అందించాలని సూచించారు. తడి చెత్తను ఇంట్లోనే ఎరువుగా మార్చుకునే ప్రక్రియను మెప్మా సిబ్బందితో వార్డ్ ప్రజలకు వివరించారు. ఇష్టానుసారంగా చెత్తను పారవేసే వారికి జరిమానా విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పసెడ్ల మమత, సంపత్, రేవెళ్లి తిరుపతి వార్డ్ ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న బ్యాంకు అధికారులు

జూలపల్లి: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో ప్రధానమంత్రి బీమా జ్యోతి పథకంలో వరాల స్వాతి, గుంటి రమ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పీఎం బీమా జ్యోతి ద్వారా మంజూరైన రూ.రెండు లక్షల విలువ గల చెక్కులను నామినీలు అయిన వరాల కనుకయ్య, బైర అనూషకు యూనియన్ బ్యాంకు మేనేజర్ సురేశ్, పెద్దపల్లి ఎల్‌డీఎం వెంకటేశ్ అందజేశారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దపల్లిరూరల్: తడి, పొడి చెత్తను, ఇతర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలని కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. పెద్దపల్లిలోని శ్రీరాంనగర్ ప్రాంతంలో గురువారం చెత్త సేకరణ తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య సిబ్బంది సేకరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మెప్మా ఆర్‌పీలు ఇంటింటికీ వెళ్లి చెత్తను వేర్వేరుగా నిల్వ ఉంచి పారిశుధ్య సిబ్బందికి అందించేలా చైతన్యపర్చాలని ఆదేశించారు. నాయకులు పాగాల శ్రీకాంత్ ఉన్నారు.

చలో కొత్తగూడెం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సదానందం

పెద్దపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై జూన్ 4న కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో తలపెట్టిన ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం కోరారు. పెద్దపల్లిలో గురువారం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. తొమ్మిదేళ్లుగా పాలన సాగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రజా సమస్యలను వివరించేందుకే ప్రజాగర్జన సభ తలపెట్టామని, విజయవంతం చేయాలన్నా రు. నాయకులు చంద్రగిరి ఉదయ్, సదానందం, అంజి, శంకర్, పూసాల రమేశ్ పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన ఆర్టీసీ బస్సు

పాలకుర్తి: సాంకేతిక లోపంతో ఆర్టీసీ లగ్జరీ బస్సు మార్గమధ్యంలో నిలిచిన సంఘటన గురువారం కన్నాల టోల్‌ప్లాజా వద్ద చోటు చేసుకుంది. గోదావరిఖని డిపోకు చెందిన ఆర్టీసీ లగ్జరీ బస్సు గోదావరిఖని బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తోంది. బస్సు బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే అందులో సాంకేతిక లోపం తలెత్తి నిలిచిపోయింది. దీంతో డ్రైవర్ బస్సును అక్కడే నిలిపివేశాడు. అందులో ప్రయాణిస్తున్న దాదాపు 25మంది ప్రయాణికులను ఇతర బస్సుల్లో ఎక్కించి ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో ‘ఆదర్శం’

- రామగుండం మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ
- పరీక్షలో జిల్లాస్థాయిలో వరుసగా 3, 4, 5, 6 ర్యాంకులు



రామగుండం ఆదర్శ విద్యాలయం

రామగుండం: ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫలితాలు గురువారం విడుదల అయ్యాయి. రామగుండం ఆదర్శ స్కూల్ నుంచి 17 మంది విద్యార్థులు ఉపకారవేతనం పొందేందుకు అర్హత సాధించి ఆదర్శంగా నిలిచారు. నిదా తస్నీమ్, కె.బాలు, అనుదీప్, స్నేహిత, సాత్విక్, విష్ణువర్ధన్, రాజమనోజ్ఞ, ఎల్.రోహిత్, ఏఎల్ఎస్ఎస్.అభిరాం, ఎం.వరుణ్, ఎల్.విద్వేష్, కె.సాయిచరణ్, ఎ.ప్రసూణ, పి.అమూల్య, డి.లాస్య, జి.మేఘన, టి.సిరివర్షిణి ఉన్నారు.

ప్రతీ ఏడాది రూ.12వేలు..

కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పేరుతో అందిస్తున్న ఉపకారం నిరుపేద విద్యార్థులకు వరంగా మారింది. 8వ తరగతి పూర్తయిన విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసేందుకు అర్హులు. ఈ స్కీమ్‌లో ఎంపికైన విద్యార్థులకు 9, 10వ తరగతితో పాటు ఇంటర్ పూర్తయ్యే వరకు (వరుసగా నాలుగేళ్లు) ప్రతి ఏడాది రూ.12వేలు ఉపకారవేతనాన్ని సదరు విద్యార్థి బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంది. ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేశారు.

గడిచిన పదేళ్లలో ఎంపికైన విద్యార్థులు..

దేశవ్యాప్తంగా నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో రామగుండం ఆదర్శ విద్యాలయం నుంచి ఎంపికయ్యే వారు ఎక్కువ. పదేళ్లుగా రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించడం విశేషం. 2013-14వలో ముగ్గురు, 2014-15లో ఒకరు, 2015-16లో 8, 2017లో 38, 2018లో 15, 2019లో 19, 2020లో 27, 2021లో 13, 2022లో 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

నమ్మకం కుదిరింది



మాది రైల్వేస్టేషన్ ఏరియా మహబూబ్ బస్తీ. నాన్న టీ స్టాల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాకు ఉన్నత చదువులు చదువుకోవాలనే ఆసక్తి ఉంది. ఇంటర్ వరకు మాత్రం నేను స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడంపై నాకు ఉన్నత చదువులపై మరింత నమ్మకం కుదిరింది. – నిదా తస్నీమ్, జిల్లా స్థాయి 3వ ర్యాంక్

మా నాన్న కూలీ



మాది గోదావరిఖనిలోని విఠల్ నగర్. మా నాన్న కూలీ పని చేసి కుటుంబాన్ని పోషిస్తుంటాడు. నిత్యం కుటుంబ పోషణపైనే నాన్న దృష్టి సారిస్తుంటాడు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ర్యాంకు రావడానికి ఉపాధ్యాయుల కృషి మరువలేనిది.

– ఆర్.స్నేహిత, విఠల్‌నగర్, జిల్లా ఆరో ర్యాంకు

ఏటా ఎంపిక



కేంద్రం నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో రామగుండం ఆదర్శ విద్యాలయం నుంచి ఎంపిక కావడం తప్పనిసరి. ర్యాంకులు సాధించడం టీచర్ల బోధనే కొలమానమని చెప్పుకోవచ్చు. ఫలితంగా ప్రభుత్వ విద్యాసంస్థలపై పేరెంట్స్‌కు నమ్మకం కుదురుతుంది.

– సారాతస్నీమ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

నెలరోజులుగా కొనుగోలు కేంద్రాల్లోనే



నిరసన తెలుపుతున్న రైతులు, పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

- కాంటాలు వేయడం లేదని రైతుల నిరసన

మంథని: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి. మంథని మండలం చిన్నఓదాల, గోపాల్ పూర్ కేంద్రాల్లో గురువారం రైతులు ధర్నా నిర్వహించి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు కాంగ్రెస్ నాయకులు మద్దతుగా నిలిచారు. నెలరోజులు కావస్తున్నా కాంటాలు వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వేసిన వాటిలో తరుగు పేరుతో బస్తాకు రెండు నుంచి మూడు కిలోలు అదనంగా తూకం వేస్తున్నారని ఆరోపించారు. తూకం వేసిన ధాన్యానికి రశీదు ఇవ్వడం లేదన్నారు. ధాన్యం తూకం వేసిన తర్వాత రైస్‌మిల్లుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కేంద్రాల్లో కనీసం టార్పాలిన్ కవర్లు అందుబాటులో లేవన్నారు. లారీలు సరిపడా లేక కాంటాలు ఆలస్యం అవుతున్నాయని వాపోయారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, లేని పక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని పార్టీ నాయకులు పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ శశిభూషణ్ కాచే, జిల్లా చైర్మన్ ముసుకుల సురేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఆర్ల నాగరాజు, మాజీ సర్పంచ్‌లు నాగుల రాజయ్య, చంద్రు రాయమల్లు, నాయకులు మోతుకు సంతోష్, శేఖర్, రాజబాపు, మేడ రాజయ్య, ఇందారపు అనిల్ పాల్గొన్నారు.

బీరన్న పట్నాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న నాయకులు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గ్రామంలో 26 నుంచి ప్రారంభం కానున్న బీరన్న పట్నాలకు రావాలని కోరుతూ గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని ధూళికట్ట యాదవ, కుర్మ సంఘం నాయకులు కలిసి ఆహ్వానించారు. సంఘం అధ్యక్షుడు కొండ తిరుపతియాదవ్, కోశాధికారి మారం లక్ష్మన్‌యాదవ్, సభ్యులు సందనవేని రాజయ్యయాదవ్, మాజీ అధ్యక్షుడు మారం మల్లేశంయాదవ్, కొండ రవియాదవ్ ఉన్నారు.

నేటి నుంచి బీరన్న పట్నాలు

మండలంలోని ధూళికట్టలో కుర్మ, యాదవ కులసస్తుల ఆధ్వర్యంలో 26 నుంచి జూన్ 2వరకు బీరన్న పట్నాల ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 26న బీరప్ప మహంకాళమ్మవారికి పాలు నెయ్యి, అభిషేకం, 27న వీరగంధాలతో గంగ బోనం, 28న సుంకు కార్యక్రమం, రాత్రి సరుగు వేయుట, 29న బీరప్ప లగ్నబోనాలు, బీరప్ప కామరావతి కలల్యాణం, 30న జోగెత్తడం, రాత్రి నాగవెల్లి బోనాలు, 31న నాగవెల్లి పట్నం, అగ్నిగుండాలు, ఒడిబియ్యం, బీరయ్య దేవుడు చెట్టు ఎక్కుట, జూన్ 1న ఎట్టి ముల్లెలు మోయడం, 2న గారడి వేషం, దిష్టికుంభం వంటి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు వివరించారు.

ఆత్మగౌరవ ప్రదర్శనకు తరలిన యాదవులు

ధర్మారం: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యాదవులను కించపరిచే విధంగా మాట్లాడినందుకు నిరసనగా హైదరాబాద్‌లో చేపట్టిన యాదవుల ఆత్మగౌరవ ప్రదర్శనకు గురువారం ధర్మారం మండల యాదవసంఘం ఆధ్వర్యంలో యాదవసంఘం నాయకులు తరలివెళ్లారు. హైదరాబాద్‌కు తరలి వెళ్లిన వారిలో యాదవసంఘం మండల అధ్యక్షుడు ఆవుల ఎల్లయ్య, నాయకులు జంగ మహేందర్‌యాదవ్, నాగరాజు, జిల్ల కనుకయ్య తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

✦వేడుకలు ఘనంగా నిర్వహించాలి

గోదావరిఖని: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆర్జీ-2 జీఎం మనోహర్ సూచించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఏర్పా చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2న అబ్దుల్‌కలాం స్టేడియంలో ఏర్పాట్లు ఘనంగా చేయాలన్నారు.

✦ప్రభుత్వ స్థలం పరిశీలన

కమాన్‌పూర్: మండలంలోని నాగారం గ్రామ పరిధిలోని లింగాల ఊరచెరువు వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని జెడ్పీచైర్మన్ పుట్ట మధు పరిశీలించారు. గ్రామ అవసరాల కోసం స్థలాన్ని గ్రామానికి కేటాయించాలని తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావును ఆదేశించారు. సర్పంచ్ ఇటవేన కొమురమ్మ, మాజీ జెడ్పీటీసీ మేకల సంపత్, నడిగొట్లు సంపత్, రాజయ్య, నారాయణ, ఉపేందర్, శంకర్ ఉన్నారు.

✦కంటివెలుగులో 157 మందికి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గ్రామంలో గురువారం కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. 157 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. సర్పంచ్ కావేరి, ఎంపీటీసీ సావిత్రమ్మ, వైద్యాధికారి నిస్సీ క్రిస్టీనా, ఆప్తమాలజిస్టు క్యాంపు ఆఫీసర్ స్వప్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

✦ఆలయంలో ప్రత్యేక పూజలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. ఇటీవల గ్రామంలో నూతనంగా నెలకొల్పిన గ్రామ దేవత శ్రీపోచమ్మ, విగ్రహ ప్రతిష్ఠాపన చేసిన భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి దేవతలను దర్శించుకున్నారు. జీఎం దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ దాసరి లక్ష్మి, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజలింగు సన్మానించారు. సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి పాల్గొన్నారు.

✦28వరకు గడువు పొడిగింపు

పెద్దపల్లిరూరల్: గురుకుల ఉపాధ్యాయ పోటీపరీక్షకు ఉచిత శిక్షణ పొందగోరే అభ్యర్థులు ఈనెల 28 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు బీసీ సంక్షేమశాఖ అధికారి రంగారెడ్డి తెలిపారు. 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 0878-2268686ను సంప్రదించాలన్నారు.

మంథనిలో స్వేరోస్ విక్టరీ డే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ పుట్ట శైలజ

మంథని: స్వేరోస్ ఇంటర్నేషనల్ విక్టరీ డే వేడుకలను గురువారం మంథనిలో నిర్వహించారు. స్వేరోస్ రాష్ట్ర కార్యదర్శి కన్నూరి శ్రీశైలం, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్మన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, జెడ్పీటీసీ తగరం సుమలత, ఎంపీపీ కొండ శంకర్, పేరెంట్స్ కమిటీ జిల్లా అధ్యక్షుడు నక్క శంకర్ పాల్గొన్నారు.

కళాకారునికి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖని: ఒగ్గు కథలో రాణిస్తున్న స్థానిక కళాకారుడు పానుగంటి రవి(డప్పు రవి)ని గురువారం ఘనంగా సన్మానించారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ స్థాయి అవార్డ్ అందుకున్న సందర్భంగా ఇఫ్టా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో సన్మానించారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, నాయకులు కొరిమి రాజ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యాలయంలో జెండా ఎగురవేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సన్మానిస్తున్న అమరగాని శ్రీనివాస్

జూలపల్లి: సీఎం కప్ క్రీడాపోటీల్లో మండల, జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జూలపల్లి క్రీడాకారులు ఎంపికయ్యారు. మండల కేంద్రానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులు సుల్తాన్ సాగర్, చేపూరి మహేశ్, టిక్కం సునీల్, బొమ్మెనవేణి సతీశ్, కోడూరి రాజశేఖర్‌ను కేసీఆర్ సేవాదళం మండల అధ్యక్షుడు అమరగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ నాడెం మల్లారెడ్డి, పీఈటీలు కొమ్మ సతీశ్, ఆవుల రాజు, సంబారి అరవింద్ ఉన్నారు.

జేఎన్‌టీయూలో హెల్త్ క్యాంపు



పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం మంథని జేఎన్‌టీయూ కళాశాలలో బేగంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయగా కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రెడ్డి ప్రారంభించారు. కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి బీపీ, షుగర్ టెస్టులు చేసి మందులు పంపిణీ చేసి కొంత మందిని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

కటింగ్ లేకుండా ధాన్యం కొనాలి



మాట్లాడుతున్న గజ్జెల స్వామి

ధర్మారం: వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు గజ్జెల స్వామి డిమాండ్ చేశారు. ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీలోని వరిధాన్యం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటాల్‌కు నాలుగు నుంచి ఐదు కిలోల ధాన్యం కటింగ్ పెడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు రైస్ మిల్లర్లకు వత్తాసు పలకడం అన్యాయమన్నారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, నాయకులు తిరుపతియాదవ్, శ్రీనివాస్, సాయి కృష్ణ, గుమ్ముల మల్లేశం, తిరుపతినాయక్, కరేటి వేణుమాధవ్, కొమురయ్య పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో ధర్మారం యువత సత్తా



బహుమతి అందిస్తున్న కలెక్టర్ సంగీత

ధర్మారం: సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో ధర్మారం మండల యువత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఎంపీడీవో జయశీల తెలిపారు. విజేతలకు కలెక్టర్ సంగీతసత్యనారాయణ బుధవారం బహుమతి అందించారు. మహిళా వాలీబాల్ విభాగంలో జిల్లాస్థాయిలో రెండో స్థానం, ఖోఖో పురుషుల విభాగంలో జిల్లాస్థాయిలో రెండో స్థానం, అథ్లెటిక్స్‌లో స్విమ్మింగ్‌లో కుమార్ ఉమశ్రీ రెండో స్థానం, కుమారి శ్రావ్య మూడో స్థానంలో, షాట్‌పుట్‌లో మూడో స్థానం సాధించినట్లు వెల్లడించారు. క్రీడాకారులను ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బుచ్చిరెడ్డి అభినందించారు.

వైభవంగా బొడ్రాయి వేడుకలు



వేడుకల్లో గ్రామస్తులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్‌లో మూడురోజులుగా భూలక్ష్మి, శ్రీలక్ష్మి సహిత గ్రామ శిల బొడ్రాయి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కాగా చివరిరోజు గురువారం గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. 27న గ్రామ ప్రజలు పోచమ్మతల్లి బోనాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలను పురస్కరించుకొని డప్పు కళాకారులను గ్రామ సామాజిక కార్యకర్త నిమ్మరాజుల రవి సత్కరించారు.

ముగిసిన పోచమ్మ కొలుపు ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న బొడ్రాయి సహిత దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా పోచమ్మ కొలుపు ఉత్సవాలు గురువారం ముగిశాయి. కాగా బుధవారం రాత్రి పోచమ్మ దేవతామూర్తుల వద్ద పంబాల పూజారులు పట్నాలు వేసి కొలుపు ఉత్సవాలను ప్రారంభించారు.

బీరన్న, పోచమ్మ బోనాలు



పూజల్లో మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో గురువారం బీరన్నపట్నాలు, పోచమ్మ బోనాలు జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నాయకులు శ్రీనివాస్, సంతోష్ ఉన్నారు.

పథకాల్లో ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేయాలి

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ఎస్సీ పరిధిలో ఉన్న 57 ఉపకులాల అభ్యర్థులకు సమన్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బాణాల రాజారామ్ డక్కలి కోరారు. ఈ మేరకు గురువారం పలు అంశాలను పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హుజూరాబాద్‌లో ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో కేవలం మాదిగ, మాలలకే పరిమితం చేయకుండా 57 ఉపకులాల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. అదేవిధంగా రెండో విడతలో పంపిణీ చేయనున్న దళితబంధులో ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఉపకులాల అభ్యర్థులకు 40శాతం వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

వారి నేత్రాలు సజీవం



సింగరావు(ఫైల్)



రాజమ్మ(ఫైల్)

యైటింక్లయిన్ కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన తుల సింగరావు (80), వడ్లకొండ రాజమ్మ(85) అనే వృద్ధులు గురువారం మృతి చెందగా కుటుంబ సభ్యులు వారి నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్‌తో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. సమాజహితం కోసం ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించాలనే సదుద్దేశంతో వారి నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, లింగమూర్తి అభినందించారు.

న్యాయం చేయాలని వివాహిత ధర్నా



పిల్లలతో బైఠాయించిన సాహిత్య

పెద్దపల్లిరూరల్: తనకు న్యాయం చేయాలంటూ వేములవాడకు చెందిన సాహిత్య తన ఇద్దరు పిల్లలతో కలిసి గురువారం జిల్లాకేంద్రంలోని జెండా కూడలివద్ద బైఠాయించి నిరసన తెలిపింది. ఆరేళ్ల క్రితం పెద్దపల్లికి చెందిన సిద్ధార్థతో తనకు వివాహమైందని, అత్తమామ ఆడపడుచులు తన భర్తకు లేనిపోని మాటలు చెప్పి ఇద్దరి మధ్య గొడవలు జరిగేలా చేశారని ఆరోపించింది. అప్పటినుంచి భర్త దూరంగా ఉంటున్నాడని, న్యాయం చేయాలంటూ గురువారం పోలీసుతాణాలో ఫిర్యాదు చేసింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంథని: మంథని మండలం పుట్టపాక సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని సత్యసాయి నగర్‌కు చెందిన రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. కమాన్‌పూర్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొని మంథనికి తిరిగివస్తుండగా పుట్టపాక వద్ద గేదెలు అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. తల, ఇతర శరీర భాగాల్లో గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ తరలించారు. అంతకు ముందు మరో యువకుడు రోడ్డుపై ఉన్న గేదెను ఢీకొనడంతో కాలుకు గాయం కాగా కరీంనగర్ తరలించినట్లు స్థానికులు తెలిపారు.